ఆంధ్రజ్యోతి
andhrajyothy.com మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 40.3 । కనిష్ఠం 26.7



ఆదిలాబాద్ జిల్లా వార్తలు


బుధవారం 12 జూన్ 2024




● జిల్లాకేంద్రంలో అధ్వానంగా కనిపిస్తున్న గెజిటెడ్ నెం.1 ప్రభుత్వ పాఠశాల పరిసరాలు



● మరాఠి పాఠశాల గదిలోనే నిల్వ ఉంచిన సిమెంట్ బస్తాలు, వస్తు సామగ్రి



● తిర్పెల్లి పాఠశాలలో అసంపూర్తిగా కనిపిస్తున్న పనులు



● పాఠశాల ఆవరణలో పెద్దపెద్ద రాళ్లు ఇలా..

సమస్యల.. స్వాగతం

- జిల్లాలో ఈ యేడు కూడా సమస్యలతో స్వాగతం పలుకనున్న సర్కారు బడులు
- పాఠశాలల్లో ఎక్కడికక్కడ అసంపూర్తిగానే కనిపిస్తున్న మరమ్మతులు
- అదనపు గదుల నిర్మాణం కోసం తవ్విన గుంతలు అలానే వదిలేయడంతో ప్రమాదాలు జరిగే అవకాశం
- చాలాచోట్ల పాఠశాలల ఆవరణలోనే మిగిలిపోయిన ఇసుక, కంకర, మట్టి కుప్పలు, ఇనుప చువ్వలు
- ఆరుబయట తరగతులతో మళ్లీ చదువులు ఆగమాగం
- ఏజెన్సీ పాఠశాలల్లో మరీ అధ్వానపు పరిస్థితులు
- అధికారుల నిర్లక్ష్యంతో ముందుకు పడని ప్రభుత్వ బడులు
- జిల్లావ్యాప్తంగా నేటి నుంచే పాఠశాలల పునః ప్రారంభం



ఆదిలాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఈయేడు కూడా సర్కారు బడులు సమస్యలతోనే విద్యార్థులకు స్వాగతం పలుకుతున్నాయి. గత నాలుగైదు మాసాలుగా మరమ్మతులు చేపడుతున్నా.. అసంపూర్తిగానే కనిపిస్తున్నాయి. కొత్త ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతులను చేపట్టేందుకు పనులను ప్రారంభించింది. అయినా ఇంకా అసంపూర్తిగానే కనిపిస్తున్నాయి. వర్షాకాలం ప్రారంభంకావడంతో పనులు చేపట్టేందుకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. వేసవి సెలవులు పూర్తికావడంతో తిరిగి బుధవారం నుంచి పాఠశాలలు పునర్ ప్రారంభం కానున్నాయి. జిల్లాలో డీఈవో పరిధిలో 702 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో నాలుగు పాఠశాలలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఐటీడీఏ పరిధిలో 444 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 664 పాఠశాలల్లో మరమ్మతులను చేపట్టగా.. ఇప్పటి వరకు 431 పాఠశాలల్లోనే మరమ్మతులను పూర్తి చేశారు. మిగితా 233 పాఠశాలల్లో ఈనెల 20 వరకు పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతీ పాఠశాలలో గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు, ప్రధానోపాధ్యాయుడు, పిల్లల తల్లిదండ్రులతో ఓ కమిటీని ఏర్పాటు చేశారు. మరమ్మతు పనుల పర్యవేక్షణ బాధ్యతను కూడా ఈ కమిటీకి అప్పచెప్పారు. అయితే, గడువులోగా పనులు పూర్తి చేయాలని కలెక్టర్ రాజార్షిషా పదేపదే హెచ్చరించినా.. అడుగడుగున అధికారుల నిర్లక్ష్యమే కనిపిస్తోంది. బుధవారం నుంచి పాఠశాలలు పునర్ ప్రారంభమవుతున్నా.. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా కనిపిస్తోంది. ఈసారి కూడా ఇబ్బందుల నడుమనే చదువులు కొనసాగించాల్సిన పరిస్థితులు ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. గతంలో మాదిరిగానే ఈ యేడు కూడా సవాలక్ష సమస్యలతో సర్కారు బడుల్లో చదువులు సాగనున్నాయి.

ఎక్కడి పనులు అక్కడే..

అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద చేపట్టిన పనులు ఇంకా అసంపూర్తిగానే కనిపిస్తున్నాయి. జిల్లాలో అన్ని పాఠశాలల్లో పనులను ప్రారంభించినా.. మెజార్టీ పాఠశాలల్లో మరుగుదొడ్లు, కిచెన్ షెడ్, ప్రహరీల నిర్మాణం, ఫ్లోరింగ్, తాగునీటి వసతి పనులు పూర్తయినట్లు కనిపించడం లేదు. ఇప్పటికే గ్రామాల్లో సర్పంచుల పదవీ కాలం ముగిసిపోవడంతో పనులపై పర్యవేక్షణ కరువైంది. దీంతో పనులను సకాలంలో పూర్తి చేయలేరన్న వాదనలున్నాయి. అలాగే పనులు చేసినా.. సకాలంలో బిల్లులు కూడా చేతికి రావడం లేదని తెలుస్తుంది. మూడు మాసాలు గడిచిపోయినా.. కొన్ని పాఠశాలల్లో ఇప్పటి వరకు మరుగుదొడ్లు, కిచెన్ షెడ్, ప్రహరీల నిర్మాణ పనులను ప్రారంభించనే లేదు. దీంతో ఈసారి కూడా ఆరు బయటనే విద్యార్థులు అత్యవసరాలను తీర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం అమలుతో మరిన్ని ఇబ్బందులే ఎదురవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఇలాంటి పరిస్థితికి దారి తీసిందన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

ఆగమవుతున్న చదువులు

చాలా పాఠశాలల్లో సరిపడా తరగతి గదులు లేకపోవడంతో అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద తరగతి గదుల నిర్మాణానికి పనులను ప్రారంభించారు. కానీ చాలాచోట్ల పనులను పూర్తి చేయకుండానే వదిలేశారు. దీంతో మళ్లీ అవే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గతంలో ఒక్కో తరగతి గదిలో రెండు, మూడు క్లాసులను కూర్చొబెట్టి పాఠాలు చెప్పే పరిస్థితి ఉండేది. అలాగే కొన్ని పాఠశాలల్లో అలాంటి పరిస్థితి కూడా లేకపోవడంతో చెట్ల నీడలోనే చదువులు కొనసాగేవి. అసలే వానాకాలం.. ఆపైగా తరగతి గదులు లేకపోవడంతో ఇబ్బందికరంగా మారనుంది. ఈదురు గాలులు, భారీ వర్షాలు కురిస్తే పాఠశాలలకు సెలవులు ప్రకటించే పరిస్థితి ఏర్పడుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. అలాగే చెట్ల కింద చదువులతో విద్యార్థులు ఏకాగ్రతను కోల్పోవడంతో పాటు ప్రమాదాల బారీన పడే అవకాశం ఉందంటున్నారు. అసంపూర్తిగా మిగిలిపోయిన పనులతో అవస్థలు తప్పవంటున్నారు. చాలాచోట్ల పాఠశాల ఆవరణలోనే మిగిలిపోయిన ఇసుక, కంకర, మట్టి కుప్పలు, ఇనుప చువ్వలు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. అలాగే అదనపు గదుల నిర్మాణం కోసం తవ్విన గుంతలను పూడ్చక పోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందంటున్నారు.

భయం భయంగానే బడికి..

ఏజెన్సీ మారుమూల గ్రామాల్లో భయం భయంగానే విద్యార్థులు బడికి వెళ్లే పరిస్థితి కనిపిస్తోంది. ఎందుకంటే ఏళ్ల తరబడి పాఠశాల భవనాలు మరమ్మతులకు నోచుకోకపోవడంతో ప్రమాదకరంగా మారి కనిపిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతలను గ్రామ పంచాయతీలకు అప్పగించిన సర్పంచుల పదవీ కాలం ముగియడంతో అటువైపు కన్నెత్తి చూసే వారే కరువయ్యారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఉన్నా.. వారు పంచాయతీ విధులలోనే బిజీబిజీగా ఉన్నారు. వేసవి సెలవుల్లో సరైన పర్యవేక్షణ లేకపోవడంతో పాఠశాలల పరిసరా లు అస్తవ్యస్తంగా మారి కనిపిస్తున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఏజెన్సీ గ్రామాలలో విద్యా విధానం గాడి తప్పుతోంది. ప్రభుత్వం నిర్మించిన పాఠశాల భవనాలు కొన్ని గ్రామాల్లో పశువుల పాకలుగా మారాయి. స్థానికులు పాఠశాల భవనాలను పశువులు, గొర్రెలు, మేకలకు ఆశ్రయంగా మారుస్తున్నారు. ఏళ్ల తరబడి మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రమాదకరంగా మారి శిథిలావస్థకు చేరుకున్నాయి. వర్షాకాలంలో భయం భయంగానే విధులు నిర్వహించాల్సి వస్తుందని పలువురు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. చాలాచోట్ల వ్యవసాయ పనిముట్లు, ఎడ్లబండ్లు, నాగళ్లను స్థానికులు నిల్వ చేసుకుంటున్నారు. ఇప్పటికీ పలు ఏజెన్సీ గ్రామాలలోని పాఠశాల భవనాలలోనే పంచాయతీ పాలన కొనసాగడం గమనార్హం.

పాఠశాలల్లో త్వరలోనే పనులను పూర్తి చేస్తాం

: ప్రణీత, డీఈవో, ఆదిలాబాద్



ప్రభుత్వ ఆదేశాల ప్రకారం త్వరలోనే పనులను పూర్తి చేస్తాం. ఇప్పటికే 431 పాఠశాలల్లో పనులను పూర్తి చేయడం జరిగింది. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నాం. కొన్నిచోట్ల పనులు అసంపూర్తిగా కనిపిస్తున్నా.. ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. మరమ్మతులకు సంబంధించిన నిధుల కొరత ఏమీ లేదు. పనులు పూర్తి కాగానే బిల్లులు చెల్లిస్తున్నాం.

సంక్షిప్త సమాచారం



ఈఈగా బాధ్యతలను స్వీకరించిన శివరాం

పీఆర్ ఈఈగా బాధ్యతలు చేపట్టిన రాథోడ్ శివరాం

ఆదిలాబాద్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరింగ్ ఈఈగా రాథోడ్ శివరాం మంగళవారం ఉద్యోగ బాధ్యతలను చేపట్టారు. కాగా, గతంలో ఈఈగా పని చేసిన ఆర్.మహవీర్ గత నెలలో ఉద్యోగ విరమణ పొందడంతో తలమడుగు హెడ్‌క్వాటర్ తాంసి డీఈగా పని చేస్తున్న రాథోడ్ శివరాంకు ఫుల్ అడిషనల్ ఇన్‌చార్జీ (ఎఫ్ఏసీ) బాధ్యతలను అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో రాథోడ్‌శివరాం ఆదిలాబాద్ ఈఈగా కొనసాగుతున్నారు. ఈఈగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన శివరాంకు పలువురు డీఈలు, జేఈలు, సిబ్బంది పుష్పగుచ్ఛాన్ని అందించి అభినందనలు తెలిపారు.

రేపు ప్రజా ఫిర్యాదుల విభాగం

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 11: వర్షాకాలం నేపథ్యంలో విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం బుధవారం ఎస్ఈ కార్యాలయంలో గ్రీవెన్స్ (ప్రజా ఫిర్యాదుల విభాగం) నిర్వహిస్తున్నట్లు ఎస్ఈ జేఆర్ చౌహన్ తెలిపారు. ఈ మేరకు ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో విద్యుత్ వినియోగదారులు పడుతున్న సమస్యలను పరిష్కరించేందుకు ఫిర్యాదుల విభాగం నిర్వహిస్తున్నట్లు తెలపారు. ఇప్పటి వరకు కురిసిన ఆకాల వర్షాల కారణంగా శాఖకు భారీ నష్టం కలిగిందన్నారు. అక్కడక్కడ పోల్స్ ట్రాన్స్ ఫార్మర్‌కూడా సమస్యలు వచ్చాయన్నారు. 24 గంటలు విద్యుత్ సిబ్బంది అందుబాటులో ఉంటూ నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని ఆయన తెలిపారు. బుధవారం నిర్వహించే ఫిర్యాదుల విభాగాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

ఐటీఐ అడ్మిషన్లకు 14 వరకు గడువు పొడిగింపు

ఆదిలాబాద్ రూరల్/మావల, జూన్ 11: ప్రభుత్వ ఐటీఐలో మొదటి దఫా అడ్మిషన్ 2024 ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు పొడగించినట్లు ఆదిలాబాద్ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ సుజాత మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంజనీరింగ్, నాన్ ఇంజినీరింగ్ ట్రేడ్స్‌లలో శిక్షణను పొందడానికి మొదటి దఫా సీట్ల కోసం జూన్ 14 వరకు గడువు పొడిగించినట్లు పేర్కొన్నారు. iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో నిజ ధ్రువపత్రాల ఆధారాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉట్నూర్: ఉట్నూర్ మండల కేంద్రంలోని గిరిజన పారిశ్రామిక శిక్షణ సంస్థలో ప్రవేశాల గడువు ఈ నెల 14 వరకు పొడగించడం జరిగిందని ఐటీఐ ప్రిన్సిపాల్ రమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. 14ఏళ్ల వయస్సు నిండిన పదవ తరగతి ఉత్తీర్ణులైన వారు 2024 విద్యా సంవత్సరానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు.

విద్యార్థులు చదువులో రాణించాలి

● జిల్లా కలెక్టర్ రాజార్షిషా ● 'బెస్ట్ అవైలబుల్ స్కూల్'కు లక్కీడ్రా ద్వారా విద్యార్థుల ఎంపిక ● ఇచ్చోడలో 'రైతునేస్తం'లో పాల్గొన్న కలెక్టర్

ఆదిలాబాద్ రూరల్, జూన్ 11: విద్యార్థులు చదువులో రాణించాలని జిల్లా కలెక్టర్ రాజార్షిషా అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ పట్టణంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ద్వారా అమలు చేస్తున్న బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకంలో ఎంపిక చేయబడిన పేరొందిన ప్రైవేట్ పాఠశాలల్లో ఎస్సీ విద్యార్థులకు ఉచిత ప్రవేశం కోసం లక్కీ డ్రా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ హాజరై లక్కీ డ్రా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఒకటో తరగతిలో 16 మంది బాలికలు, 31 మంది బాలుర, ఐదో తరగతిలో 15మంది బాలికలు, 30 మంది బాలుర ఎంపికైనట్లు తెలిపారు. ఇందులో డీఎస్‌సీ డీవో సునీత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్, సెక్టార్ ఆఫీసర్ నారాయణ, సూపరింటెండెంట్ పూర్ణచందర్ పాల్గొన్నారు.



లక్కీ డ్రా కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ రాజార్షిషా

● రైతునేస్తం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఇచ్చోడ: రైతులకు వ్యవసాయంలో మంచి సలహాలు, సూచనలు ఇస్తే అధిక దిగుబడులు సాధిస్తారని కలెక్టర్ రాజార్షిషా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. రైతులు సేంద్రియ సాగుపై ప్రత్యేక దృష్టిసారించి రైతులను ప్రోత్సహించాలన్నారు. వర్షాకాలంలో రైతులు జాగ్రత్తగా ఉండాలన్నారు. వర్షాలు, వాగులు, విద్యుత్తు, తదితర విషయాల్లో జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం పీఏసీసీఎస్ కార్యాలయాన్ని సందర్శించి అక్కడి నుంచి మండలంలోని జామిడి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలను అందజేశారు. బడి బయటి పిల్లలందరినీ బడిలో చేర్పించాలన్నారు. ఇందులో జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య, తహసీల్దార్ తుకారాం, డీటీ రామారావు, మండల వ్యవసాయాధికారి కైలాష్, ఏఈవోలు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులున్నారు.



రైతునేస్తం కార్యక్రమాన్ని వీక్షిస్తున్న కలెక్టర్ రాజార్షిషా



జామిడిలో విద్యార్థులకు ఏకరూప దుస్తులను అందజేస్తూ..

గిరిజనులకు నాణ్యమైన విద్య, వైద్యం

● ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్త

ఉట్నూర్, జూన్ 11: ఉమ్మడి ఆదిలాబాద్‌లోని గిరిజనులందరికీ నాణ్యమైన విద్యా, వైద్యం అందిస్తామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్త అన్నారు. మంగళవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఉన్న పీఆర్సీ పీఎంఆర్సీ భవనంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గొండ్వానా పంచాయతీరాజ్ సెంటర్ సార్ మెటీరియల్ జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు., గిరిజన విద్యార్థులకు పౌష్టికాహారంతో పాటు ఉచిత నాణ్యమైన ఆంగ్ల మాధ్యమంలో బోధన విద్య వ్యవస్థను బలోపేతం చేస్తామన్నారు. ప్రాథమిక విద్యలో నూతన ఉరవడిలో ఆంగ్ల మాధ్యమం బోధించుటకు వేదిక్ గణితము, నిర్మాణ్ ఆర్గనైజేషన్ ద్వారా శిక్షణ ఇప్పిస్తామని అన్నారు. మారుమూల గ్రామాలలో వైద్య సదుపాయాలు అందించే విధంగా ప్రతి గ్రామంలో ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, అవ్వాల్ అంబులెన్స్ సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. ఇందులో ఏపీవో పీవీటీజీ డాక్టర్ కుడుమెత మనోహర్, ఈఈ రాథోడ్ భీమ్‌రావ్, జీసీసీ డీఎం రామనందం, పరిపాలన అధికారి సున్నంరాంబాబు, బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ మేస్రం మనోహర్, పెస కోఆర్డినేటర్ అరక వసంతరావు, ఏసీఎంఈవో జగన్, జిల్లా మేడి మేస్రం దుర్గపటేల్, కురుశంగా మోతిరామ్, తదితరులు పాల్గొన్నారు.

● మినీ గురుకులాల్లో ప్రవేశం కోసం దరఖాస్తులు

ఉట్నూర్: ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ మినీ గురుకుల పాఠశాలల్లో 1వ తరగతి ప్రవేశం కోసం అర్హులైన గిరినులు దరఖాస్తులు చేసుకోవాలని ఐటీడీఏ పీవో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని లోకారి, నేరడిగొండ, బేల, మామడ మండలాల్లోని పాఠశాలల్లో విద్యనభ్యసించే వారితో పాటు 2, 3, 4, 5వ తరగతుల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. అర్హులైన బాలికలు ఈ నెల18లోగా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. స్థానిక మండలాల బాలికలకు ప్రాధాన్యం ఉంటుందన్నారు.



మాట్లాడుతున్న పీవో ఖుష్బుగుప్త



హాజరైన ఆదివాసీ సంఘాల నాయకులు





కొలాంగూడ వద్ద రోడ్డుపై కూలిన భారీ వృక్షం, ఆగిపోయిన వాహనాలు

ఏజెన్సీలోని పలు మండలాల్లో భారీ వర్షం

● ఈదురు గాలులు.. పలుచోట్ల నేలకూలిన చెట్లు

ఉట్నూర్, జూన్ 11: ఏజెన్సీలోని పలు మండలాల్లో మంగళవారం భారీ వర్షం కురిసింది. ముఖ్యంగా ఉట్నూర్ మండలంలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి కోలాంగూడ వద్ద భారీ వృక్షం నేలకూలింది. రోడ్డుపైన భారీ వృక్షం పడిపోవడంతో ఇటువైపు కొత్తగూడ చెక్‌పోస్టు వరకు, అటు వైపు దంతనపల్లి కొలాంగూడ వరకు వాహనాలు నిలిచి పోయి ట్రాఫిక్ జాం ఏర్పడింది. ఉట్నూర్ మంచిర్యాల ప్రధాన రహదారి పై భారీ వృక్షం నేలకూడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కరీంనగర్ వైపు నుంచి మహారాష్ట్ర వైపు పేషేంట్‌తో వెళ్తున్న అంబులెన్స్ సైతం ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుంది. కొందరు కార్ల యజమానులు పొలాల వెంట తమకార్లను తీస్తుండడంతో అంబులెన్స్ డ్రైవర్ సైతం పొలం వెంట అంబులెన్స్ తీసే ప్రయత్నం చేయగా పొలంలో అంబులెన్స్ కూరుకుపోవడంతో ప్రజలు అంబులెన్స్‌ను తోస్తూ బయటకు తీశారు. కరీంనగర్ వైపు నుంచి ఆదిలాబాద్ వెళ్తున్న ఆర్‌అండ్‌బి ఈఈ నర్సయ్య సైతం ట్రాఫిక్‌జామ్‌లో ఇరుక్కున్నారు. ఉట్నూర్ మండల కేంద్రంలో ఉన్న ఆర్‌అండ్‌బి ఏఈ అరవింద్ అందుబాటులో లేక పోవడంతో ఆయన స్వయంగా జేసీబీ యజమానులకు ఫోన్లు చేసి రప్పించి వృక్షం తొలగించే చర్యలు చేపట్టారు. అప్పటికే స్థానికులు సైతం చెట్ల కొమ్మలను తొలగిస్తూ ట్రాఫిక్‌ను పునరుద్ధరించే చర్యలు చేపట్టారు. ఏది ఏమైనా ఆర్‌అండ్‌బి అధికారుల నిర్లక్ష్యం వల్ల వర్షాకాలం కంటే ముందు నుంచి రోడ్ల పైనా చెట్లు కూలుతు ప్రజలకు ఇబ్బందులు అవుతున్న పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఉట్నూర్ మంచిర్యాల ప్రధాన రహదారి పై గంట పాటు వాహనాలు నిలిచి పోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. మృగశిర కార్తె ప్రారంభమైన మూడు రోజుల తర్వాత మంగళవారం సాయంత్రం 20నిమిషాలు కురిసిన భారీ వర్షంతో ప్రజలు కాసింత ఊరట చెందారు.

● పిడుగు పాటుకు ఆవు మృతి

ఉట్నూర్: మండలంలో మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి తోడు పిడుగు పాటుకు గురై ఆవు మృతి చెందింది. కొమ్ముగూడెంకు చెందిన రైతు భామిని స్వామికి చెందిన ఆవుపై పిడుగు పడడంతో ఆవు అక్కడికక్కడే మృతి చెందినట్లు రైతు వాపోయాడు.

● నేరడిగొండలో ఉరుములు మెరుపులతో వర్షం

నేరడిగొండ: మండలంలో పలు గ్రామాల్లో మంగళవారం ఉరుములు, మెరుపులతో పాటు ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. వర్షంతో మండలంలో ఖరీఫ్ పనులు ఊపందుకునున్నాయి. రైతులు విత్తనాలు వేయడంలో బిజీబిజీగా మారనున్నారు.



నేరడిగొండలో కురుస్తున్న వర్షం

'అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో మండలాభివృద్ధి'

ఆదిలాబాద్ రూరల్, జూన్ 11: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేస్తూ మండలాభివృద్ధికి పాటు పడాలని ఆదిలాబాద్ రూరల్ ఎంపీపీ గండ్రత్ రమేష్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ మేరకు ఆయా శాఖల అధికారులు తమ శాఖల పరిధిలోని ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. సభ్యులు స్థానికంగా నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా భీంసరి గ్రామంలో చేసిన ఎన్ఆర్ఈజీఎస్ సీసీ రోడ్లు, డ్రైనేజీ పనుల్లో నాణ్యత లోపించడంపై, పనులు సక్రమంగా జరగనప్పుడు ఎలా రికార్డుచేస్తారని పంచాయతీ రాజ్ జేఈ సలాఉద్దీన్‌ను భీంసరి ఎంపీటీసీ బిక్కి గంగాధర్ ప్రశ్నించారు. దీనిపై జేఈ మరో వారం రోజుల్లో సీసీ రోడ్డుపై ఒక లేయర్ వేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆయా శాఖాధికారులు వారి వారి నివేదికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి, ఎంపీవో వెంకట రాజు, మండల ఏవో అష్రఫ్, ఏఈ తిరుపతి రెడ్డి, మండల వైద్యాధికారి సర్ఫరాజ్ ఖాన్, ఏపీవో జాకీర్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదిలాబాద్ రూరల్ ఎంపీపీ గండ్రత్ రమేష్

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 11: ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్ ప్రాంతంలో గల ఐస్ ఫ్యాక్టరీ సమీపంలో మంగళవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. ఖానాపూర్‌కు చెందిన షేక్ సలీమ్ ఇంట్లో ఎవరు లేని సమయంలో అగ్ని ప్రమాదం సంభవించింది. దీంట్లో ఇంట్లోని గృహోపకరణాలు, ఫ్రిజ్; టీవీ, కూలర్, దుస్తుతో పాటు తదితర వస్తువులు కాలి బూడిదయ్యాయి. కాగా, ఇంట్లో నుంచి మంటలు రావడంతో స్థానికులు గమనిచి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అగ్నిమాపక శాఖకు సమాచారం అందించడంతో సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అర్పివేశారు. దాదాపు రూ. లక్షల విలువగల ఆస్తి నష్టం సంభవించిందని బాధితుడు వాపోయాడు.

'ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య'

ఉట్నూర్, జూన్ 11: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య బోధన అందిస్తున్నందున తల్లిదండ్రులు తమపిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపకుండా ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని ఉట్నూర్ జిల్లా పరిషత్ సెకండరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు జాదవ్‌రమేష్ అన్నారు. మంగళవారం ఉట్నూర్ పట్టణంలోని శాంతినగర్, బోయవాడలలో బడిబాట కార్యక్రమాన్ని ఉపాధ్యాయులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉంటారని, ప్రభుత్వ పాఠశాలలో చదవడం ద్వారా విద్యార్థులకు రాబోయే రోజుల్లో సంక్షేమ పథకాలు అందుబాటులోకి వస్తాయన్నారు. బాసర ట్రిపుల్ ఐటీలో ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులకు ప్రాధాన్యమిచ్చి ప్రవేశాలు కల్పిస్తారని ఇలాంటి అవకాశాలు పోగొట్టుకోవద్దన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జాదవ్ ఉపేందర్, రాములు, దత్తరాం, రాజు, నరేష్, తదితరులున్నారు.

'గంజాయి సాగు చేస్తే చర్యలు తప్పవు'

నేరడిగొండ, జూన్ 11: గంజాయి సాగు చేస్తే చర్యలు తప్పవని ఇచ్చోడ సీఐ భీమేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో గల పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఎస్పీ గౌస్ఆలం ముందస్తు సమాచారం మేరకు నేరడిగొండ మండలంలోని రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద ఎస్సై శ్రీకాంత్ తన సిబ్బందితో తనిఖీలు నిర్వహిస్తుండగా హైదరాబాద్‌లోని కాగజ్‌గూడ కమాన్‌కు చెందినా పాపిశెట్టి సంతోష్‌కుమార్ గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నారు. గంజాయిని ఇంద్రవెల్లి మండలం ధర్మసాగర్ గ్రామానికి చెందిన సాబ్లె జైత్‌రాం అమర్‌సింగ్‌ల వద్ద కొనుగోలు చేసానని తెలపడంతో వారిని సైతం అధీనంలోకి తీసుకోవడం జరిగిందన్నారు. పట్టుకున్న గంజాయి 6.600 గ్రాములు విలువ రూ.లక్షా 65వేల వరకు ఉంటుందని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఘనంగా భీర్సాముండా వర్ధంతి

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 11: భీర్సాముండా ఆశయ సాధనకు ఆదివాసులు పాటు పడాలని హీరాసుఖ జాగృతి ప్రధాన్ సమితి జిల్లా అధ్యక్షుడు సిడాం రాంకిషన్ పిలుపునిచ్చారు. మంగళవారం బీర్సాముండా 124వ వర్ధంతిని సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వేస్టేషన్ సమీపంలోని భీర్సాముండా విగ్రహానికి పూజలు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హీరాసుఖ జాగృతి ప్రధాన్ సమితి అధ్యక్షుడు రాంకిషన్ మాట్లాడుతూ గతంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ కోటి రూపాయలతో భీర్సాముండా భవనంతో పాటు కాంస్య విగ్రహాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అదే విధంగా ప్రతి ఆదివాసీ గూడెంలో బీర్సాముండా జీవిత చరిత్రను తెలియ జేస్తామని ప్రకటించారన్నారు.కాని ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు లేవన్నారు. ఆదివాసుల కోసం ఉద్యమించిన యోధుడు భీర్సాముండాను ఆదర్శంగా తీసు కుంటు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సమితి నాయకులు మేస్రం కృష్ణ, గేడం మహాదేవ్, డొంగ్రె మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

తాంసిలో మృతి చెందుతున్న ఎద్దులు

● పట్టించుకోని పశువైద్యాధికారులు ● లబోదిబోమంటున్న అన్నదాతలు

తాంసి, జూన్ 11 : అవి వ్యాధులో.. లేక మరే మో తెలియదు కాని అరకకు నడిచే కాడెడ్లు మృత్యువాత పడుతున్నాయి. పర్యవేక్షించాల్సిన పశువైద్యాధికారులు పట్టింపు లేనట్లుగా వ్యవహ రిస్తున్నారన్న ఆరోపణలు సర్వత్ర వ్యక్తమవుతున్నాయి. గత రెండు రోజుల వ్యవధిలో ఒకే రైతుకు చెందిన రెండు ఎద్దులు మృతి చెందాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ పనులు ముమ్మరంగా కొనసాగుతున్న తరుణం. ఇంతలోనే ఎద్దులు చనిపోతూ ఉండటంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వివరాల్లోకి వెళితే తాంసి మండలంలోని వడ్డాడి గ్రామానికి చెందిన సయ్యద్ మహ్మద్ అనే రైతుకు సంబంధించిన ఎద్దులు చనిపోయాయి. దీంతో సుమారు లక్ష రూపాయల నష్టం జరిగినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. దినమంతా అరక పనికి నడిచిన ఆ ఎద్దులు సాయంత్రం ఇంటికి రాగానే ఒకటి మృతి చెందింది. మరో ఎద్దు తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో మరుసటి రోజు మృతి చెందినట్లు సంబంధిత రైతు పేర్కొన్నారు. రాత్రి ఇంటి వద్దకు వచ్చిన పశువులు తెల్లరేసరికి మృత్యువాత పడ్డాయని రైతు రోదిస్తూ పేర్కొన్నారు. ఈ విషయం పశువైద్య సిబ్బందికి, అధికారులకు తెలియజేసిన పట్టింపు లేనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు అంటున్నారు. పొలం నుంచి ఇంటికి వచ్చిన పశువులు మేత మేయక పోవటంతో రైతులు సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. కానివారు సకాలంలో రాలేకపోవడంతో తమ పశువుల ను కాపాడుకోలేక పోయామని అంటున్నారు.అసలు ఆ ఎద్దుల మృతికి కారణాలు ఏమిటనే విషయంలో గ్రామరైతులు ఆందోళన చెందుతున్నారు. రెండుకాడెడ్లు చనిపోవడంతో ఆ రైతు మంచం పట్టారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నాడు. ఈ విష యమై సంబంధిత పశువైద్యాధికారిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేరు.



: మృతి చెందిన ఎద్దులు

నేటి నుంచి మోగనున్న బడిగంట

● కొనసాగుతున్న బడి బాట కార్యక్రమం ● 90 శాతం పాఠశాలలకు చేరిన పాఠ్య పుస్తకాలు



ప్రాథమిక పాఠశాల, చించాల

ముథోల్,జూన్ 11: వేసవి సెలవుల అనంతరం నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. వేసవి సెలవుల్లో ఉల్లాసంగా గడిపిన విద్యార్థులు చదువుల తల్లి ఒడిలోకి వస్తున్నారు. ఇందుకోసం ముథోల్ మండలంలో విద్యాసంస్థలు సిద్ధమయ్యాయి. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు నేటి నుంచి ప్రారంభం అవుతున్నాయి. ముథోల్ మండలంలో ప్రాథమిక పాఠశాలలు 29, ప్రాథమికోన్నత పాఠశాలలు 4,ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు 8తో పాటు రెసిడెన్షియల్ పాఠశాలలు 6 మొత్తం మండలంలో 47 పాఠశాలలున్నాయి. అయితే 41 ప్రభుత్వ పాఠశాలల్లో 1242 బాలురు, 1715 మంది బాలికలు విద్యను అభ్యసిస్తున్నారు. మొత్తం 2,957 విద్యార్థులకు గాను సుమారు 22 వేల వరకు పాఠ్య పుస్తకాలు, 63వేల 61 మీటర్లు ఏకరూప దుస్తుల కొరకు బట్టలు వచ్చినట్లు ఎంఈవో మైసాజీ తెలిపారు. సంబంధిత పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు, ఉన్నత పాఠశాలలకు నోట్ బుక్స్‌లు చేరాయని పేర్కొన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో మౌలిక వసతులు, గదుల మరమ్మతులు కూడా దాదాపు పూర్తి కావడానికి చివరి దశలో ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే విద్యార్థులకు నేటి నుంచి ఉచిత పాఠ్యపుస్తకాలతో పాటు దర్జీల వద్ద కుట్టిచ్చిన సమదుస్తులను విద్యార్థులకు అందజేయనున్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా పోషకులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు ఉచిత మధ్యాహ్న భోజనం, దుస్తులు, పుస్తకాలు ప్రభుత్వం అందజేస్తుందని తెలుపుతున్నారు. వేసవి సెలవుల్లో ఇంటి వద్ద ఉన్న పిల్లలు నేటి నుండి బడి బాట పట్టనున్నారు.

● పాఠశాలలు పునః ప్రారంభానికి ముమ్మర ఏర్పాట్లు

ఆదిలాబాద్ రూరల్: వేసవి సెలవుల అనంతరం ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఇందు కోసం పాఠశాలల్లో ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటున్నారు. తరగతి గదులు పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. ఇప్పటికే బడిబాట కార్యక్రమతోపాటు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపడుతున్న మరమ్మతు పనులను సైతం పూర్తి చేసేలా అధికార యంత్రాంగం ముమ్మర చర్యలు చేపట్టారు.

● నేటి నుంచి ప్రారంభం కానున్న పాఠశాలలు.

బజార్‌హత్నూర్: మండలం పరిధిలో ఉన్న 23 ప్రైమరీ పాఠశాలలు, 5 అప్పర్ ప్రైమరీ పాఠశాలలు, 24ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలు, 2 ఆశ్రమ ఉన్నత పాఠశాలలు,ఆదర్శపాఠశాల, కేజీబీవీ, 04 జిల్లా పరిశత్ సెకండరీ పాఠశాలలు నేటి నుంచి ప్రాంభం కానున్నాయి. ఏప్రిల్ 24వ తేదీ నుంచి జూన్ 11వ తేది వరకు పాఠశాలలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. తిరిగి జూన్12 నుంచి పాఠశాలలు యధావిధిగా కొనసాగనున్నాయి.

బడి బస్సు భద్రమేనా..?

● నేటి నుంచి బడులు ప్రారంభం ● సామర్థ్య పరీక్షలకు ముందుకు రాని యాజమాన్యాలు



ప్రైవేటు స్కూల్ బస్సు

భైంసా, జూన్ 11 : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు పున: ప్రారంభానికి సన్నద్ధమయ్యాయి. బుధవారం నుంచి బడులు తెరుచుకోనున్నాయి. ప్రైవేట్ విద్యా సంస్థల నిర్వాహకులు అడ్మిషన్ల కోసం విస్తృత ప్రచార పర్వాన్ని చేపట్టాయి. అయితే ఆయా సంస్థలు విద్యార్థుల ప్రవేశాలపై చూపుతున్న శ్రద్ధ బడి బస్సుల సామర్థ్య పరీక్షలు చేయించడంలో చూపడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణంగా విద్యా సంస్థల బస్సుల సామర్థ్య గడువు మే 15 తో ముగుస్తుంది. అప్పటి నుంచి నూతనంగా సామర్థ్య పరీక్షలు నిర్వహించి రవాణా అధికారుల నుంచి ధ్రువీకరణ పత్రాలు తీసుకుని పాఠశాలల ప్రారంభం అనంతరం రోడ్ల పైకి రావాల్సి ఉంటుంది. గడువు ముగిసి 25 రోజులు దాటినప్పటికీ సామర్థ్య పరీక్షలకు యాజమాన్యాలు ముందుకు రాకపోవడంతో బస్సుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. నిర్మల్ జిల్లాలో 244 పైగా విద్యా సంస్థల బస్సులు ఉండగా ఇందులో మంగళవారం వరకు కేవలం 111 బస్సులకు మాత్రమే సామర్థ్య పరీక్షలు పూర్తయ్యాయి.ఇంకా 133 బస్సుల సామర్థ్య పరీక్షలు నిర్వహించుకోవాల్సి ఉంది.

● ఇవి నిబంధనలు..

- బస్సుకు ఇరు వైపులా విద్యా సంస్థ పేరు, చిరునామా, ఫోన్ నంబర్ రాసి ఉంచాలి.
- బస్సు కచ్చితంగా పసుపు రంగులోనే ఉండాలి.
- ప్రతి బస్సులో ప్రథమ చికిత్స పెట్టెతో పాటు అవసరమయ్యే మందులు అందుబాటులో ఉంచాలి.
- బస్సు డ్రైవర్ ఆరోగ్యవంతుడై ఉండడంతో పాటు 60 ఏళ్లకు మించి వయసు ఉండకూడదు.
- హెవీ వాహనంపై డ్రైవర్‌కు ఐదేళ్ల అనుభవం కలిగి ఉండాలి
- డ్రైవర్ ఆరోగ్య పరిస్థితి, కంటి చూపునకు సంబంధించిన పత్రాలు సమర్పించాలి. ప్రతి మూడు నెలలకోసారి కంటి పరీక్షలు చేయించుకోవాలి.

ప్రత్యేక తనిఖీలు చేపడుతాం

విద్యా సంస్థల బస్సుల యజమాన్యాలు రవాణాశాఖ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి. కాలయాపనకు తావు లేకుండా బస్సుల సామర్థ్య పరీక్షలు చేయించుకోవాలి.పాఠశాలలు ప్రారంభమైన తర్వాత ప్రత్యేక తనిఖీలు చేపడతాం.సామర్థ్య ధ్రువీకరణ పత్రాలు లేని బస్సులు పట్టుబడితే వాటిని సీజ్ చేస్తాం.

- మహేందర్, ఎంవీఐ, ఆర్‌టీవో కార్యాలయం, నిర్మల్

వంగిన కరెంటు స్తంభం



వంగి ఉన్న విద్యుత్ స్తంభం

బజార్‌హత్నూర్, జూన్ 11: మండలంలో ఇటీవల కురిసిన గాలి వానలకు మహదేవ్ నగర్‌కు సమీపంలో ఉన్న విద్యుత్ స్థంభం మొత్తం ఒకవైపు వంగడంతో కరెంటు వైర్లు క్రిందకు తగిలేల వేలాడుతున్నాయి. అటువైపుగా పశువులను మేతకు వెళ్తే కరెంటు ప్రమాదానికి గురైతే మరణించే ప్రమాదం ఉటుందని గ్రామస్థులు తెలిపారు. వెంటనే విద్యుత్ అధికారులు స్పందించి స్తంభాన్ని బాగు చేయాలని గ్రామస్థులు కోరారు.

12న సర్టిఫికెట్ల పరిశీలన

ఆదిలాబాద్ రూరల్, జూన్ 11: జిల్లాలోని ప్రభుత్వ మండల పరిషత్, జిల్లా పరిషత్‌లో పని చేస్తున్న ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ ఉద్యోగోన్నతికి సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఈ నెల 12వ తేదీన జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఈ ఉద్యోగోన్నతికి ఏదేని బ్యాచులర్ ఆఫ్ డిగ్రీతో పాటు బీఎడ్ స్పెషల్ ఎడ్యుకేషన్ కలిగి ఉండాలని తెలిపారు. బీఎడ్ స్పెషల్, ఎడ్యుకేషన్ లేని వారు అనర్హులని పేర్కొన్నారు.

నేడు మండలంలో బోథ్ ఎమ్మెల్యే పర్యటన

నేరడిగొండ, జూన్ 11: నేరడిగొండ మండలంలో బుధవారం బోథ్ శాసనసభ్యులు అనిల్‌జాదవ్ పర్యటించనున్నట్లు ఎంపీపీ రాథోడ్ సజన్ తెలిపారు. మండలంలోని వడూర్ గ్రామంలో బడిబాట కార్యక్రమంలో పాల్గొననున్నారని అనంతరం గ్రామంలో వాంకిడి గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిశీలించనున్నారని మండల బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, అధికారులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

ప్రారంభమైన రైల్వేట్రాక్ మరమ్మతు పనులు

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 11: పట్టణంలోని తాంసి బస్టాండ్ వద్ద ఉన్న ఎస్‌సీ 30 గేటు మరమ్మతు పనులను ప్రారంభించారు. మంగళవారం నుంచి మూడు రోజుల పాటు ట్రాక్‌పై అత్యవసర పనులు చేపడుతున్నారు.ఈక్రమంలో ఆరూట్‌లో రాకపోకలను పూర్తిగా రైల్వే అధికారులు మూసి వేశారు.నాందేడ్ ఎస్ఎస్ఈ నరేష్ అధికారులతో కలిసి పనులను పర్యవేక్షించారు.ఈసందర్భంగా నాందేడ్ ఎస్ఎస్ఈ నరేష్ మాట్లాడుతూ ప్రతిమూడు సంవత్సరాలకు ఒకసారిమరమ్మతులు చేపట్టడం జరుగుతుందన్నారు.10నుంచి 13వ తేదీవరకు ఈ రూట్ బంద్ ఉంటుందన్నారు.

18లోగా దరఖాస్తు అందజేయాలి

ఆదిలాబాద్ రూరల్, జూన్ 11: మండల, జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ ఆంగ్ల మాధ్యమం, ఆదిలాబాద్‌లో 2024-25 విద్యా సంవత్సరానికి పని చేసేందుకు సంబంధిత హెచ్ఎం, ఎంఈవో అనుమతి ద్వారా దరఖాస్తులను డీఈవో కార్యాలయంలో ఈ నెల 18వ తేదీ వరకు అందజేసేందుకు గడువును పొడగించి నట్లు డీఈవో ప్రణీత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ దరఖాస్తుల పరిశీలన, ఎంపిక ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగో న్న తుల ప్రక్రియ తర్వాత జరుగుతుందని తెలిపారు. స్కూల్ అసిస్టెం ట్ గణితం 1,భౌతికశాస్త్రం1, జీవశాస్త్రం 1,సాంఘికశాస్త్రం1, ఆంగ్లం 1,హిందీ1,తెలుగు1, సెకండరీగ్రేడుటీచర్స్ 2పోస్టులు ఉన్నాయని తెలిపారు.

ఆశల విత్తనం మొలకెత్తింది



మొలకెత్తిన పత్తి మొక్క

బజార్‌హత్నూర్,జూన్ 11: రైతులు ఎం తో ఆశలతో పత్తి విత్త నాలు నాటిన మూడో రోజున పంట పొలంలో పత్తి విత్తనాలు మొలకెత్తడంతో రైతన్న మొ హంలో ఆనందం విల్లివిరిస్తుంది. ఈ సంవత్సరం సీజన్‌కు ముందుగానే వానలు కురుస్తాయని పలు మార్లు వాతావరణ శాఖ తెలుపడంతో రైతులు భగవం తుని పై భారం వేసి ముందుగానే విత్తనాలను వేశారు. రెండు మూడు రోజులు వానలు కురవడంతో పత్తి విత్తనాలు మొలకెత్తాయి. జిల్లాలో అధిక మోతాదులో రైతులు పత్తి పంటను సాగుచేస్తున్నారు.

ప్రయాణికుల రద్దీకి అనుకూలంగా బస్సులు పెంచాలి

నిర్మల్ కల్చరల్, జూన్ 11: పెరుగుతున్న ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచాలని మంగళవారం పీవోడబ్ల్యూ బస్ డిపో ఎదుట ఆందోళన చేసింది. డీఎంకు వినతి పత్రాన్ని అందించారు. మహాలక్ష్మి పథకం వల్ల మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగిందని అధ్యక్షురాలు లక్ష్మీ తెలిపారు. రాజన్న, గంగామణి, లక్ష్మీ, కవిత, తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

ఆదిలాబాద్ రూరల్, జూన్ 11: ఆదిలాబాద్ రైల్వే స్టేషన్‌లో మంగళవారం గుర్తు తెలియని రైలు ఢీకొని ఒక వ్యక్తి కాలు పూర్తిగా తెగిపోయింది. మహాలక్ష్మీవాడకు చెందిన అమృత్(55) అనే వ్యక్తి పట్టాలు దాటే సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. దీంతో ఆయన ఎడమ కాలు తొడ వద్ద నుంచి పూర్తిగా తెగిపోయింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది రేఖా, విఠల్ గౌడ్ సంఘటన స్థలానికి వెళ్లి క్షతగాత్రుడిని రిమ్స్‌కు తరలించారు.

ప్రైవేట్ ఆస్పత్రుల తనిఖీ



ఆస్పత్రిలో తనిఖీ చేస్తున్న బృందం సభ్యులు

ఆదిలాబాద్ రూరల్, జూన్ 11: ఆస్పత్రుల తనిఖీలో భాగంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని మూడు ప్రైవేట్ ఆస్పత్రులను తనిఖీ బృందం సభ్యులు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రుల రికార్డులు పరిశీలించి నిర్వాహణకు సంబంధించి పలు సూచనలు చేశారు. జిల్లాలో రిజిష్టర్ కాని ఆస్పత్రులు ఉన్నచో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీ బృందంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, ఐడీఎస్పీవో డాక్టర్ అశోక్, రాంప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

నిర్మల్ కల్చరల్, జూన్ 11 : నిర్మల్ నియోజకవర్గంలోని పలు గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు డిపో మేనేజర్ ప్రతిమా రెడ్డికి వినతి చేశారు. అక్కాపూర్, ముక్తాపూర్, న్యూ వెల్మల్, బొప్పారం, కూచన్‌పెల్లి మీదుగా సోన్ మండల కేంద్రానికి బస్సులు నడిపించాలని కోరారు. న్యూ పోచంపాడ్, భాగ్యనగర్, కిషన్ రావుపేట్, మామడ మండలం బూరుగుపల్లికి బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. సీనియర్ నాయకుడు అల్లూరి మల్లారెడ్డి, గంగాధర్ డీఎంను కలిసిన వారిలో ఉన్నారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన సుగుణ



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన ఆత్రం సుగుణ

ఉట్నూర్, జూన్11: కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థిగా ఓటమి చెందినప్పటికి అధైర్యానికి గురికావద్దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించినట్లు కాంగ్రెస్ నాయకురాలు ఆత్రంసుగుణ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాల అనంతరం మంగళవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని, జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క, టీపీసీసీరాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తుమల్లేష్‌లతో కలిసి సీఎం క్యాంపు కార్యాలయంలో కలవడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ముఖ్యమంత్రిని శాలువాతో సత్కరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో గట్టి పోటీని ఇచ్చినందుకు సీఎం ఆమెను ప్రత్యేకంగా అభినందించినట్లు తెలిపారు. గెలుపోటములు సహాజమనిఅధైర్యపడకుండా జిల్లాలో అందరు కలిసి కట్టుగా కాంగ్రెస్ పార్టీ జెండా కింద పని చేయాలని ముఖ్యమంత్రి సూచించినట్లు సుగుణక్క తెలిపారు. అదే తెగువతో ముందుకు సాగాలని నిత్యం ప్రజాక్షేత్రంలో ఉంటూ ప్రజాదారణ పొందాలని తెలియజేసినట్లు చెప్పారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు చేర్చే విధంగా కృషి చేయాలని సీఎం చెప్పినట్లు ఆమె పేర్కొన్నారు.

గ్రామ సంఘాల వార్షిక ఆడిట్

భోథ్, జూన్ 11: మండల కేంద్రంలోని వెలుగు ఇందిరా క్రాంతి కార్యాలయంలో మంగళవారం మహిళా సంఘాలకు సంబంధించిన రికార్డులను ఆడిట్ చేశారు. ఆడిటర్ నరేందర్ ఆడిట్ నిర్వహించగా సీసీవో ఆడిటర్ గంగాధర్ ఉన్నారు. మండలంలోని 42 గ్రామ సంఘాల రికార్డులను పరిశీలించడం జరుగుతుందని ఆడిటర్ పేర్కొన్నారు. 2023-24 సంవత్సరానికి సంబంధించిన ఆడిట్ నిర్వహించడం జరుగుతుందని ఏపీఎం మాధవ్ తెలిపారు.

రాహుల్ ప్రధాని అవ్వాలని కఠోర దీక్ష



భూపెల్లి శ్రీధర్

ఆదిలాబాద్ రూరల్, జూన్ 11: దేశానికి రాహుల్ గాంధీ ప్రధాని కావాలని ఓ కాంగ్రెస్ నాయకుడు కఠోర దీక్ష చేపట్టారు. మావల మండలంలోని వాఘాపూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకడు భూపెల్లి శ్రీధర్ మొదటి నుంచి కాంగ్రెస్ అభిమాని, కాగా రాహుల్ గాంధీ ప్రధాని అయ్యేంత వరకు తాను చెప్పులు వేసుకోనని మంగళవారం హనుమాన్ ఆలయంలో ప్రమాణం చేస్తూ దీక్ష చేపట్టారు. గతంలో కూడా శ్రీధర్ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని ఐదేళ్ల చెప్పులు వేసుకోలేదు. కాంగ్రెస్‌పై అభిమానంతో శ్రీధర్ తన పిల్లలకు కొడుకు పేరు రాజీవ్‌గాంధీ, కూతురు పేరు ఇందిరా ప్రియదర్శిని అని పేర్లు పెట్టారు.

అందుబాటులో సోయాబీన్ విత్తనాలు

తాంసి, జూన్ 11 : మండల కేంద్రంలోని సహకార సొసైటీ కార్యాలయంలో రైతులకు కావాల్సిన సోయా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని సీఈవో కేశవ్ తెలిపారు. సోయా వేసే రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రస్తుతం తమ వద్ద జేఎస్ 9305, ఎంఏయూఎస్ 612 అనే రకాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. 30 కిలోల బస్తా 2525 రూపాయలకు విక్రయిస్తున్నామని తెలిపారు.



స్థానిక సమరానికి



- ఇక స్థానిక సంస్థల దిశగా పార్టీలు
- జిల్లాలో కాంగ్రెస్‌కు అస్త్రంగా పవర్ పాలిటిక్స్
- లోక్‌సభ గెలుపు దూకుడుతో రంగంలోకి బీజేపీ
- బీఆర్ఎస్ అస్తిత్వంపై నీలినీడలు
- జోరుగా లోకల్ పాలి'ట్రిక్స్'!

నిర్మల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో లోక్‌సభ ఎన్నికల ఫలితాల కారణంగా రాజకీయ సమీకరణలు తలకిందులు కాబోతున్నాయంటున్నారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అస్తిత్వాన్ని కోల్పోవడమే కాకుండా ఆ పార్టీకి చెందిన సీనియర్ నేతలు, క్రియాశీల కార్యకర్తలంతా కాంగ్రెస్ పార్టీలో చేరిపోవడంతో ఒక్కసారిగా ఆ పార్టీ నిర్వీర్యమైపోయింది. మొన్నటి వరకు మంత్రిస్థాయిలో కార్యకలాపాలు కొనసాగించిన బీఆర్ఎస్ పార్టీ ప్రస్తుతం ముఖ్యనాయకులు లేని పార్టీగా మారిపోయింది. బీఆర్ఎస్ పూర్తిగా బలహీనపడడాన్ని కాంగ్రెస్ పార్టీ అనుకూలంగా మలుచుకుంది. కాగా లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ పార్టీ ఘనవిజయం సాధించడం, కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల కన్నా రెండింతల ఓట్లు ఎక్కువగా సాధించడంతో ఇక తెరపైనా ఈ రెండు పార్టీలే మిగలబోతున్నాయని అంటున్నారు. ఈ నేపథ్యంలోనే అటు కాంగ్రెస్, ఇటు బీజేపీలు రాబోయే స్థానిక ఎన్నికలకు ముందస్తుగానే సన్నాహాలు చేసుకోవడంలో నిమగ్నమవుతున్నాయి. స్థానిక ఎన్నికల సమయం వరకు తమ అధికార బలాన్ని అస్త్రంగా మలుచుకొని జనానికి మరింత చేరువ కావాలని కాంగ్రెస్ పార్టీ ఇప్పటి నుంచే సన్నాహాలు మొదలు పెడుతోంది. జిల్లాకు పెద్దమొత్తంలో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను మంజూరు చేయడమే కాకుండా భారీగా నిధులను కేటాయింపజేయడం అలాగే బీజేపీ కార్యకలాపాలకు చెక్ పెట్టడం లాంటి అంశాలను పరిగణలోకి తీసుకోబోతోందంటున్నారు. ఎలాగైనా స్థానిక సంస్థల ఎన్నికల్లో పైచేయి సాధించి తమ పట్టును విస్తరింపజేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ యోచిస్తోందంటున్నారు. కాగా బీజేపీ పార్టీ సైతం మొన్నటి అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల విజయాలను కొలమానంగా చేసుకుంటూ స్థానిక సంస్థల ఎన్నికల్లో భారీ విజయం సాధించాలని ఇప్పటి నుంచే పావులు కదుపుతోంది. దీనికి అనుగుణంగా ఆ పార్టీకి చెందిన నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, జిల్లా అధ్యక్షులు అంజుకుమార్ రెడ్డిలతో పాటు తదితర నేతలంతా స్థానిక సంస్థల్లో గెలుపు కోసం ఇప్పటి నుంచే వ్యూహరచన సాగిస్తున్నారంటున్నారు. ఇలా కాంగ్రెస్, బీజేపీ పార్టీలు స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోబోతుండడం ప్రాధాన్యతను సంతరించుకుబోతోందని చెబుతున్నారు.

పవర్ పాలి'ట్రిక్స్' దిశగా కాంగ్రెస్...

కాగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు, ముథోల్ మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు పటేల్‌లతో పాటు తదితరులు మొన్నటి లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై సీరియస్‌గా సమీక్షించడమే కాకుండా మెజారిటీ తగ్గడానికి కారణాలపై లోతుగా విశ్లేషణ జరిపారు. మోదీ ఇమేజ్‌తో పాటు హిందుత్వ ప్రచారం లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కువగా ప్రభావం చూపిన కారణంగానే బీజేపీ జిల్లాలో మెజారిటీ సాధించగలిగిందని వారంతా నిర్ధారణకు వచ్చారు. ముఖ్యంగా యూత్ బీజేపీ పార్టీ వైపు మొగ్గడంపై కాంగ్రెస్ పార్టీ సమాలోచనలు జరుపుతోంది. అయితే లోక్‌సభ ఎన్నికల్లో జరిగిన పార్టీ పరమైన పొరపాట్లను అధిగమించి పట్టును రెండింతలు చేసుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ఇప్పటి నుంచే ఎత్తులు వేస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడం అలాగే జిల్లా ఇన్‌చార్జీ మంత్రిగా సీతక్క అలుపెరగకుండా శ్రమించే తత్వం కలిగి ఉండడాన్ని అనుకూలంగా మలుచుకోవాలని కాంగ్రెస్ పార్టీ యోచిస్తోంది. సీతక్క ద్వారా జిల్లాకు భారీ మొత్తంలో నిధులు మంజూరు చేయించుకోవడం అలాగే అభివృద్ధి, సంక్షేమ పథకాలను పెద్దఎత్తున మంజూరు చేయించడంతో పాటు నిరుద్యోగులు, మహిళలను ఆకర్షించడం అలాగే వారి మద్దతును మరింత కూడగట్టడం లాంటి అంశాలపై కాంగ్రెస్ పార్టీ దృష్టి సారించనుందంటున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్ పదవులతో పాటు ఎంపీటీసీ పదవులు, జడ్పీటీసీ, మున్సిపల్ కౌన్సిలర్ పదవులను చేజిక్కించుకోవాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. జడ్పీ చైర్‌పర్సన్ పదవితో పాటు మెజారిటీ ఎంపీపీ పదవులను కైవసం చేసుకొని తమ పార్టీ ప్రతిష్ఠను పెంచుకోవాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. దీనికి అనుగుణంగానే రాబోయే రోజుల్లో ఓ వైపు అధికారిక కార్యక్రమాలు మరోవైపు పార్టీ పరమైన కార్యక్రమాలను విస్తృతంగా కొనసాగించేందుకు కాంగ్రెస్ నేతలు కార్యాచరణ రూపొందించడంలో నిమగ్నమవుతున్నారు.

గెలుపు దూకుడుతో బీజేపీ

కాగా అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల వరుస విజయాలతో బీజేపీ మరింత దూకుడుగా స్థానిక సంస్థల ఎన్నికల వైపు వెళ్లేందుకు సిద్ధమవుతోంది. ఎలాగైనా స్థానిక సంస్థల్లో పూర్తిస్థాయిలో పట్టు సాధించి ఇక తన విజయ పరంపరను కొనసాగించాలని బీజేపీ ముందస్తు ప్రణాళికలు రచిస్తోంది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో దాదాపు అన్ని గ్రామాల్లోనూ బీజేపీ మెజారిటీ ఓట్లను సాధించిన కారణంగా ఇదే ఊపును స్థానిక ఎన్నికల వరకు కొనసాగించి జడ్పీ పీఠాన్నే కాకుండా మెజారిటీ ఎంపీపీ పదవులు, మూడు మున్సిపల్ ఛైర్మన్ పదవులను కైవసం చేసుకోవాలని బీజేపీ పార్టీ సిద్ధమవుతోందని అంటున్నారు. బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా బలహీన పడడం అలాగే కాంగ్రెస్ పార్టీ మొన్నటి అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో వెనకబడిపోవడం ప్రజల్లో ఇంకా మోడీ ఇమేజ్ తగ్గకపోవడం రెండు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే ప్రాతినిధ్యం కొనసాగుతుండడం లాంటి అంశాలను బీజేపీ అస్త్రాలుగా మలుచుకోబోతోంది. గతంలో ఎన్నడు లేని విధంగా శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో భారీ మెజారిటీ సాధించడంతో ఆ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. ఈ ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తూ రాబోయే స్థానిక ఎన్నికల వరకు కొనసాగించాలని లక్ష్యంగా పెట్టుకుంటోంది. ముఖ్యంగా యూత్, మహిళల ఓట్లు బీజేపీకి అనుకూలంగా ఉండడాన్ని ఆ పార్టీ చివరి వరకు ఇదే ఊపును కొనసాగించాలని భావిస్తోంది. ఎక్కడికక్కడ కేడర్‌ను పెంచుకోవడం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ తప్పిదాలను జనంలోకి పెద్ద ఎత్తున తీసుకువెళ్లి వారి సానుభూతిని పెంచుకోవడం లాంటి అంశాలకు ఆ పార్టీ ప్రాధాన్యతనివ్వబోతోందంటున్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ నీరసించి పోగా శాసనసభ, లోక్‌సభ ఎన్నికల ఓటమితో కాంగ్రెస్ పార్టీలో నిస్తేజం నెలకొందని ఈ అంశాలను కొలమానంగా చేసుకుంటూ స్థానిక ఎన్నికల వరకు దూకుడును కొనసాగించి పదవులన్నింటినీ కైవసం చేసుకోవాలని బీజేపీ ముందస్తుగా వ్యూహరచన చేస్తోందంటున్నారు.

హరిహర క్షేత్రంలో హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న దృశ్యం

నిర్మల్ రూరల్, జూన్ 11 : మల్లన్నగుట్టలోని హరిహర క్షేత్రం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం హుండీలను లెక్కించారు. రూ.95,200 వచ్చాయి. గణపతి సుబ్రహ్మణేశ్వర స్వాముల వారి ఆలయంలో ఉదయం నుంచే పంచామృతాభిషేకాలు తదనంతరం నూతన వస్త్రాలంకరణ, వచ్చిన భక్తులందరికీ అన్నదాతల సంపూర్ణమైనటువంటి సహాయ సహకారాలతో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వచ్చినటువంటి భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ ధర్మకర్తలు అల్లోల వినోదమ్మ మురళీధర్‌రెడ్డి దంపతులు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ గురుస్వామి మూర్తితో పాటు వివిధ గ్రామాల నుంచి ఎందరో భక్తులు హాజరై మొక్కులను తీర్చుకున్నారని ఆలయ కోశాధికారి సామల వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.

రేణుక ఎల్లమ్మకు ఘనంగా పూజలు

కుబీర్, జూన్ 11 : మండల కేంద్రం కుబీర్‌లో సోమవారం రేణుక ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు శోభాయాత్రగా ప్రధాన వీధుల గుండా గ్రామదేవతల ఆలయాలకు చేరుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

రామోజీరావు సేవలు చిరస్మరణీయం

- తెరావే ఘన నివాళులు



రామోజీరావుకు నివాళులర్పిస్తున్న తెరావే సభ్యులు

నిర్మల్ కల్చరల్, జూన్ 11 : పత్రికా, సినీ రంగాలకు ఆ సంస్థల అధినేత రామోజీరావు చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా తెలంగాణ రచయితల వేదిక కొనియాడింది. మంగళవారం రామోజీరావు సంస్మరణ సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఐదు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ– అక్షరానికి ఆయుధమై ప్రజా ప్రయోజనాలే పరమావధిగా విశిష్ట సేవలందించారని ప్రస్తుతించారు. ఆయన మృతి పత్రికా రంగానికి తీరని లోటని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థించారు. జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల హన్మంతు, కవులు కృష్ణంరాజు, శివప్రసాద్, వెంకట్, తుమ్మల దేవరావు, పోలీసు భీమేష్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఛాంబర్స్ సమావేశానికి ఛైర్మన్ ఈశ్వర్ హాజరు

నిర్మల్ కల్చరల్, జూన్ 11 : నిర్మల్ మున్సిపల్ ఛైర్మన్ ఈశ్వర్ మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన ఛాంబర్స్ సమావేశానికి హాజరయ్యారు. ఛైర్మన్లు ఎదుర్కొంటున్న సమస్యలు సమావేశం దృష్టికి తెచ్చారు. గత ప్రభుత్వం 2019లో తెచ్చిన చట్టం కౌన్సిల్‌ను నిర్వీర్యం చేసిందన్నారు.

జిల్లాలో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం

నిర్మల్ టౌన్, జూన్ 11 : జిల్లాకేంద్రంలో మంగళవారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన మోస్తారు వర్షం కురిసింది. దీంతో పట్టణంలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. రానున్న రెండు నుంచి మూడు రోజుల్లో రాష్ట్రంలో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

ఈదురు గాలుల బీభత్సం.. ఎలక్ట్రికల్ పరికరాలు దగ్ధం

నిర్మల్ అర్బన్, జూన్ 11 : నిర్మల్ పట్టణంలో మంగళవారం ఉదయం నుంచి విపరీతమైన ఎండవేడిమి ఉండగా, సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురియడంతో వాతావరణం చల్లబడింది. విపరీతమైన ఈదురు గాలులు వీయడంతో పాటు నిర్మల్ చుట్టు పక్కల ప్రాంతాల్లో పిడుగులు పడిన భారీ శబ్దాలతో పట్టణ ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆరు గంటల వరకు దాదాపు రెండు గంటల సేపు ఈదురు గాలుల బీభత్సం కొనసాగింది. కాగా భారీ శబ్దాలతో ఉరుములు మెరుపులు రావడంతో పట్టణంలోని గాజులపేట్ ప్రాంతంలో పలు ఇళ్లల్లో ఎలక్ట్రిక్ పరికరాలైన ఫ్యాన్లు, లైట్లు, రిఫ్రిజిరేటర్లు కాలిపోయినట్లు తెలిసింది. పెద్ద ఎత్తున వచ్చిన ఉరుములు మెరుపుల కారణంగా విలువైన ఎలక్ట్రిక్ పరికరాలు ధ్వంసం అయ్యాయని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు బాధితులు కోరుతున్నారు.

పోస్టుల కోసం ప్రతిపాదనలు పంపిస్తాం

- గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి హామీ



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిర్మల్ కల్చరల్, జూన్ 11 : ఆశ్రమ పాఠశాలల్లో పీఈటీ పోస్టుల ఉన్నతీకరణ, రెగ్యులర్, గిరిజన క్రీడాకాధికారుల పోస్టులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఏ. శరత్ హామీ ఇచ్చారు. మంగళవారం ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డితో కలిసి హైదరాబాద్‌లో జిల్లా గిరిజన పీఈటీ సంఘం నాయకులు ఆయనను కలిశారు. సీఆర్టీల కౌన్సిలింగ్ నిర్వహించేందుకు చర్య తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ప్రధాన కార్యదర్శి భూక్యా రమేష్, పార్థసారథి, రాష్ట్ర నాయకులు రాఘవరెడ్డి, కృష్ణమూర్తి, తదితరులు ఉన్నారు.

జాతీయ నులి పురుగుల నివారణ దినాన్ని విజయవంతం చేయాలి

- మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆకాష్

ముథోల్, జూన్ 11 : జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేద్దామని బాసర మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆకాష్ అన్నారు. మండల కేంద్రమైన ముథోల్‌లోని ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా నేషనల్ డి వార్మింగ్ డే రోజున అందజేసే మాత్రల గురించి పలు సలహా సూచనలు అందజేశారు. 1- 2 సంవత్సరాల లోపు ఉండే పిల్లలకు 3-19 సంవత్సరాలలోపు ఉండే పిల్లలకు అందజేసే మాత్రల వివరాలను తెలియజేశారు. అలాగే 20 తేదీన పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లు, గ్రామాల్లో పిల్లలకు ఈ మాత్రలను విధిగా అందజేయాలని పేర్కొన్నారు. మాత్రలు అందని పిల్లలకు 27 తేదీన ఇంటింటికి వెళ్లి అందజేయాలని పేర్కొన్నారు. ఆరోగ్య సమాజ ఏర్పాటులో భాగంగా ప్రభుత్వం వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది నులి పురుగు (నట్టల) నిర్మూలన దినోత్సవాన్ని (ఎన్‌డీడీ - నేషనల్ డీ వార్మింగ్ డే) నిర్వహిస్తారని అన్నారు. అందులో భాగంగా ఈ నెల 20న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో శ్రీమతి, సూపర్‌వైజర్లు సరోజిని, శారద, శ్రీలక్ష్మీ, అనిత, మీనా, ఉమా, హెల్త్ సూపర్‌వైజర్ దత్తురాం, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

'విగ్రహం ధ్వంసం చేసిన వారిపై చర్య తీసుకోవాలి'

నిర్మల్ కల్చరల్, జూన్ 11 : నిర్మల్ పట్టణం గాజులపేట్ ఓ రైస్ మిల్ వెనుకాల హనుమాన్ ఆలయంలో విగ్రహం ధ్వంసం చేసి రావిచెట్టు నరికిన దుండగులపై చర్య తీసుకోవాలని కోరుతూ మంగళవారం ఎస్పీకి బీజేపీ నాయకులు వినతిపత్రం అందించారు. ప్రధాన కార్యదర్శి మేడిసెమ్మె రాజు, గాదె విలాస్, ఒడిసెల అర్జున్, పవన్, కొండాజీ శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతుల ద్వారా పంటలు సాగు చేయాలి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

నిర్మల్ టౌన్, జూన్ 11 : ఆధునిక వ్యవసాయ పద్ధతుల ద్వారా రైతులందరూ సాంప్రదాయ పంటలు సాగు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి రైతు వేదిక ద్వారా వీడియో కాన్ఫరెన్స్‌లో సాంప్రదాయ పంటల సాగుపై రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడుతూ... రైతులు ఆధునిక సాంకేతిక పద్ధతులతో సాంప్రదాయ పంటలను సాగు చేసి లాభాలు పొందవచ్చునని తెలిపారు. రసాయనిక ఎరువులు అధికంగా వాడకం వలన భూసారం తగ్గి భవిష్యత్తు తరాలు నష్టపోతాయని తెలిపసారు. రసాయన ఎరువులతో దిగుబడులు వచ్చినప్పటికీ మార్కెట్‌లో ఆ పంటలకు డిమాండ్ ఉండదని, నాణ్యత కూడా తక్కువగా ఉంటుందన్నారు. సేంద్రియ ఎరువులతో పండిన పంటలకు మార్కెట్‌లో అధిక డిమాండ్ ఉందని, రైతులంతా ఆధునిక పరిజ్ఞానాన్ని వ్యవసాయానికి జోడించి కొత్త రకపు పంటలను సాగు చేయడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చన్నారు. అంతకుముందు పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతల వెంకట రెడ్డి రైతులందరికీ వ్యవసాయంపై సాంప్రదాయ పంటలకు ఉపయోగించాల్సిన నూతన పద్ధతులు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సారంగాపూర్ మండల కేంద్రంలోని రైతు వేదిక నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ... రసాయన ఎరువుల వాడకం క్రమంగా తగ్గించి, రైతులు సహజ ఎరువుల వైపుకు మళ్లాలని సూచించారు. వ్యవసాయ అధికారులు సాంప్రదాయ పంటల సాగు, దిగుబడులపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి మంగళవారం రైతు వేదికలలో పత్తి, సోయా, మొక్కజొన్న ఇతర పప్పు దినుసుల పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమాలలో మహిళా రైతులు పాల్గొనేలా ప్రోత్సహించాలని సూచించారు. రైతులు గోవింద్ రెడ్డి, భీంరావు, నారాయణ రెడ్డి సాంప్రదాయ పంటల సాగుపై వారి అభిప్రాయాలు తెలియజేశారు. అనంతరం గ్రామ పల్లె ప్రకృతి వనం, నర్సరీని కలెక్టర్ సందర్శించి పెంచుతున్న మొక్కల రకాలు, సంఖ్య తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మిషన్ భగీరథ సర్వేను కలెక్టర్ పరిశీలించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి



రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

ఇంటి సర్వేను పకడ్బందీగా చేపట్టి ఇంటి యజమానుల నుంచి మిషన్ భగీరథ నీటికి సంబంధించిన వివరాలను సంబంధిత ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆ తర్వాత డంపింగ్ యార్డ్‌ను సందర్శించి ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్తలను వేరువేరుగా సేకరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వర్మీకంపోస్ట్ ఎరువుల తయారు పరిశీలించి సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజిప్రసాద్, తహసీల్దార్ శ్రీదేవి, రైతులు, రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు, మిషన్ భగీరథ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రైతు అవగాహన సదస్సుకు హాజరైన కలెక్టర్

సారంగాపూర్, జూన్ 11 : మండలంలో గల రైతువేదికలో వ్యవసాయ అధికారులు మంగళవారం నిర్వహించిన రైతు అవగాహన సదస్సుకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ హాజరై రైతులు పంట పొలాల్లో వేసేటటువంటి పంటల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులకు పంట పొలాల్లో ఏఏ పంటలు వేయాలో వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించారు. ఈ అవగాహన సదస్సులో ఏవో రాజశేఖర్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

పట్టణ అభివృద్ధికి పకడ్బందీ చర్యలు

- మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో ఛైర్మన్ సత్యం



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ సత్యం

ఖానాపూర్, జూన్ 11 : పట్టణ అభివృద్ధికి పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ ఛైర్మన్ చిన్నం సత్యం అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఛైర్మన్ సత్యం అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఖానాపూర్ పట్టణంలో జరుగుతున్న, జరగబోయే అభివృద్ధి పనులపైన సర్వసభ్య సమావేశంలో చర్చించినట్లు పేర్కొన్నారు. వార్డులలో ఉన్న పలు సమస్యల పైన మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం చర్చించామని త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మనోహర్, కౌన్సిలర్లు కారింగుల సంకీర్తన, జన్నారపు విజయలక్ష్మి, నాయిని స్రవంతి, పరిమి లత, ఆఫ్రీన్ బేగం, గుగ్లావత్ కిషోర్ నాయక్, అబ్దుల్ ఖలీల్, కుర్మ శ్రీనివాస్, షాజియా బేగం, కోఆప్షన్ సభ్యులు బండారి కిషోర్, మాలన్ బేగం, మున్సిపల్ ఏఈ తిరుపతి, మున్సిపల్ మేనేజర్ సురేందర్, మున్సిపల్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఫిరోజ్, మున్సిపాలిటీ అధికారులు సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు చెల్లించాలి

నిర్మల్ కల్చరల్, జూన్ 11 : మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిలులు, పెంచిన వేతనాలు చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మికులు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించి డీఈవోకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ 10 వేలు చెల్లిస్తామన్న హామీ నిలబెట్టుకోవాలని, వంటపాత్రలు ఇవ్వాలని, గ్యాస్, కోడిగుడ్లు ప్రభుత్వమే సరఫరాతో పాటు పలు సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఏఐటీయూసీ అధ్యక్షుడు భూక్యా రమేష్, లక్ష్మీ, మొనవ్వ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి : బీఎల్‌వోలు

నిర్మల్ కల్చరల్, జూన్11 : బీఎల్‌వోలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు కలెక్టర్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఖానాపూర్, కడెం, దస్తురాబాద్ ప్రాంత బీఎల్‌వోల నాయకురాలు సంపూర్ణ మాట్లాడుతూ... నూతన జీవో ప్రకారం పారితోషకం పెంచాలని కోరారు. జీతాలు సకాలంలో రావడం లేదని, ఎన్నికల విధులు నిర్వహించినా పారితోషకం చెల్లించలేదన్నారు. శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. వరలక్ష్మీ, లీలారాణి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



రాయల్టీ లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్న గిర్దావర్ సుమలత

నర్సాపూర్(జి), మే 11 : మండలంలోని డొంగుర్‌గాం సుద్దవాగు నుంచుట ఎటువంటి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని తహసీల్దార్ కార్యాలయానికి అప్పగించినట్లు గిర్దావర్ సుమలత తెలిపారు. ఈ సందర్భంగా గిర్దావర్ మాట్లాడుతూ ఇసుక ట్రాక్టర్లు వ్యవసాయ దారుల రహదారులు ధ్వంసం అవుతున్నాయని రైతులు ఫిర్యాదు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. రాయల్టీలు లేకుండా ఇసుక రవాణా చేస్తే సహించేది లేదన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించండి

నిర్మల్ కల్చరల్, జూన్ 11 : జిల్లాలోని స్థానిక సంస్థలు, గ్రామ, మండల పరిషత్, జడ్పీలకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని జడ్పీటీసీల ఫోరమ్ అధ్యక్షుడు పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి కోరారు. మంగళవారం ఆయన రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్యను మర్యాదపూర్వకంగా కలిసి ఆయన సన్మానించారు. ఆయన సానుకూలంగా స్పందించారని రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు.

ఛైర్మన్ పరామర్శ

నిర్మల్ కల్చరల్, జూన్ 11 : మున్సిపల్ కమిషనర్ రాజు కుమారుడు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతుండగా మంగళవారం ఛైర్మన్ ఈశ్వర్ పరామర్శించారు. కౌన్సిలర్ తాహీదుద్దీన్, రాజు, తదితరులు ఆయన వెంట ఉన్నారు.

ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పోస్టులు భర్తీ చేయాలి

నిర్మల్ కల్చరల్, జూన్ 11 : రాష్ట్రంలో పది వేల ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పోస్టులు మంజూరు చేసి బదిలీ షెడ్యూల్‌లో పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు వై. సాయన్న ఒక ప్రకటనలో మంగళవారం డిమాండ్ చేశారు. 317 జీవో ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల స్థానికత ఆధారంగా బదిలీలు చేయాలన్నారు. భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులు అప్‌గ్రేడ్ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

సీనియారిటీ జాబితా సవరించాలి

నిర్మల్ కల్చరల్, జూన్ 11 : జిల్లాలో ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించిన హిందీ, తెలుగు భాషా పండితుల సీనియారిటీ జాబితా సవరించాలని, పొరపాట్లు సవరించాలని ఎస్టీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు రాజేష్‌నాయక్ డిమాండ్ చేశారు.